సాక్షి వికారాబాద్

సోమవారం ; 21 ; జులై ; 2025



బోనాల సంబురం

ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా కనుల పండువగా కొనసాగుతున్నాయి.

8లో▸



కులం పేరుతో..

కుటుంబంపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

9లో▸



పర్యాటకుల సందడి

కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రాజెకు నీటిలో సేదతీరారు.

9లో▸

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్: తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వసంత కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, వాణిజ్య శాస్త్రం (ఆంగ్లం, ఉర్దూ మీడియం) సబ్జెక్టుల్లో రెండేసి ఖాళీలు, గణిత, రాజనీతి శాస్త్రం, హిందీ, ఉర్దూ, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రంలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని చెప్పారు. సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉత్తీర్ణులైన వారికి, బోధన అనుభవం ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అర్హులు ఈ నెల 23న సాయంత్రం 4గంటల వరకు కళాశాలలో నేరుగా దరఖాస్తులు అందజేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీవీ గీతాలక్ష్మి పట్నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్-1, ఫిజిక్స్-1, మ్యాథ్స్-1, ఇంగ్లిష్-1, కామర్స్-2, పొలిటికల్ సైన్స్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 23వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 24న డెమో క్లాసులు, ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన తాండూర్ డిగ్రీ కళాశాలలో ఉంటుందన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటండి

మాజీ మంత్రి హరీశ్‌రావు



హరీశ్‌రావుతో బీఆర్‌ఎస్ నాయకులు

దౌల్తాబాద్: మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో కలిసిన నాయకులు మండలంలోని రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మహిపాల్ తెలిపారు. హరీశ్‌రావును కలిసిన వారిలో నాయకులు నర్సింలు, అంజి తదితరులున్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

సబ్‌జైల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్



సీడ్‌బాల్స్ చల్లుతున్న రాజ్‌కుమార్ తదితరులు

పరిగి: నేడు నాటిన మొక్క రేపటి తరానికి మేలు చేస్తుందని పరిగి సబ్‌జైల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పరిగి పరిసర ప్రాంతాల్లో 200 సీడ్‌బాల్స్ చల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీడ్ బాల్స్ చల్లడంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మొక్కలను నాటే వీలుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్ల శాఖ ఇప్పటి వరకు 2 లక్షల సీడ్‌బాల్స్ తయారు చేసి చల్లామన్నారు. జైళ్ల శాఖ పెట్రోల్ బంక్‌లలో సీడ్‌బాల్స్‌ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ప్రతీ ఒక్కరు సీడ్‌బాల్స్ చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది యాదగిరి, శ్రీను, కృష్ణ, అక్షయ్, నరేశ్ పాల్గొన్నారు.

మైసమ్మ సన్నిధిలో అచ్చంపేట ఎమ్మెల్యే

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఆదివారం ఉదయం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీ రాంనాయక్, మహేందర్‌గౌడ్ ఉన్నారు.



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

వానల పలకరింపు

ముందస్తుగా మురిపించిన వానలు ముఖం చాటేశాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలకు జీవం పోసినట్లయింది. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, ఎస్పీ అధికారులను ఆదేశించారు.

మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు

- పంటలకు జీవం
- సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం
- అధిక వర్షాల కారణంగా అప్రమత్తమైన అధికారులు
- పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వికారాబాద్: గడిచిన మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ వానలకు పంటలకు జీవం పోసినట్లయింది. ఈ సీజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదవడం ఇదే తొలిసారి. ఒకటి రెండు చోట్ల భారీగా వర్షాలు కురవగా మిగిలిన చోట్ల సాధారణ వర్షపాతం నమోదయింది. ఆదివారం సైతం జిల్లాలో ముసురు వానకురిసింది. వాగులు పారుతూ చెరువుల్లోకి నీరు చేరుతోంది. గడచిన మూడు రోజుల్లో అత్యధికంగా నవాబుపేటలో 98 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవగా తాండూరులో 65.6 మిల్లీమీటర్లు, ధారూరులో 49.2 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదయింది.

అప్రమత్తమైన అధికారులు

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గత అనుభవాల నేపథ్యంలో రెవెన్యూ పోలీసు యంత్రాంగం అప్రమత్తమయింది. పలుసార్లు వరదల కారణంగా తీవ్రంగా ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో కింది స్థాయి వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మొత్తం 20 రోడ్ల పరిధిలో 26 చోట్ల ప్రమాద స్థలాలను గుర్తించారు. అన్ని చోట్ల రెవెన్యూ, పోలీసులు నిఘా ఉంచాలని కింది స్థాయి యంత్రాంగానికి సూచించారు. వానలు తగ్గే వరకు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 1,179 చెరువులు, కుంటలు ప్రాజెక్టులుండగా వాటిలోకి నీరు చేరడం ప్రారంభమైంది. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి కాలనీలు మడుగులను తలపిస్తున్నాయి. రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ప్రస్తుతం వ్యాధులు ప్రబలే సీజన్ కావటంతో హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, పాఠశాలల వార్డెన్‌లు, ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలతో అధికారులు పరిస్థితిని సమీక్షించారు.

రైతుల్లో ఆనందం

వర్షాకాలం ఆరంభం నుంచి ఇప్పటి వరకు పంటలకు సరిపడా వర్షం కురవలేదు. అప్పుడప్పుడు కురిసిన వర్షం ఏదో ఒక ప్రాంతానికే పరిమితమైంది. దీంతో మొక్కజొన్న తదితర పంటలు సగం మేర మొలకెత్తాయి. వర్షాలు కురవక కొన్ని చోట్ల పంటలు పాడవగా రేగడి పొలాల్లో కోలుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సీజన్ ప్రారంభం కావటంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి, జొన్న, మొక్కజొన్న, కంది, పెసలు, కూరగాయలు, పసుపు తదితర పంటలకు జీవం పోసినట్లయింది. వర్షాకాలం ఆరంభం నుంచి ఇప్పటి వరకు నమోదైన వర్షపాతం పరిశీలిస్తే మొత్తం జిల్లా పరిధిలోని 11 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా తొమ్మిది మండలాల్లో లోటు వర్షపాతమే కనిపిస్తోంది.

మూడు రోజులుగా నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

మండలం	18వ తేదీ	19వ తేదీ	20వ తేదీ	స్టేటస్
మర్పల్లి	00	26	2.8	లోటు
మోమిన్‌పేట్	3.3	39.9	42.9	లోటు
నవాబుపేట	1.1	98	2.5	నార్మల్
వికారాబాద్	07	38.1	02	లోటు
పూడూరు	14.8	19.5	1.9	లోటు
పరిగి	21.3	5.6	16.6	నార్మల్
కుల్కచర్ల	8.6	0.7	00	లోటు
దోమ	18.3	17	28.3	నార్మల్
బొంరాస్‌పేట	6	15	10	నార్మల్
ధారూరు	2.3	49.2	1.9	నార్మల్
కోట్‌పల్లి	31.1	23	5.9	నార్మల్
బంట్వారం	1.2	12.6	9	లోటు
పెద్దేముల్	00	35.3	00	లోటు
తాండూరు	1.9	65.6	00	నార్మల్
బషీరాబాద్	13.4	26.9	00	లోటు
యాలాల	3.2	12.2	2.1	నార్మల్
కొడంగల్	5.9	2.2	00	లోటు
దౌల్తాబాద్	7.6	1.4	00	నార్మల్
చౌడాపూర్	17.3	9.8	00	నార్మల్
దుద్యాల	10.3	2.5	00	లోటు

'ఓపెన్' చాన్స్

చదువు మధ్యలో మానేసిన వారికి..

- పదోతరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు
- ప్రత్యేక అధ్యయన కేంద్రాలు
- ఈనెల 31 వరకు గడువు
- అపరాధ రుసుముతో 28 ఆగస్టు వరకు

కేశంపేట: అనివార్య కారణాలతో మధ్యలోనే చదువు నిలిపివేసిన యువతీ యువకులకు ఓపెన్ స్కూల్ వరంగా మారింది. చదువుకోవాలనే ఆశ ఉన్నా పాఠశాలలకు వెళ్లలేని వారికి చేయూతనివ్వాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ద్వారా విద్యను అందిస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్ కావాలన్నా, కొన్ని ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా పదో తరగతి ఉత్తీర్ణత అవసరం. దీంతో చాలా మంది ఓపెన్ విద్య వైపు ఆసక్తి కనబరుస్తున్నారు.

అధ్యయన కేంద్రాలు

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 65 ఓపెన్ టెన్త్, ఇంటర్ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పహాడీషరీఫ్, హఫీజ్‌పేట, ఎన్టీఆర్ నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉర్దూ మీడియంలో చదువుకునే అవకాశం ఉంది. వికారాబాద్ జిల్లాలో 28 ఓపెన్ టెన్త్, ఇంటర్ అధ్యయన కేంద్రాలు, మేడ్చల్ జిల్లాలో 34 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం నిధులిస్తూ తోడ్పాటు అందిస్తోంది.

వీరు అర్హులు

- చదువు మధ్యలో ఆపినవారు, గృహిణులు, ఓపెన్ విద్యలో అడ్మిషన్లు పొందొచ్చు.
- 14 ఏళ్లు నిండిన వారు పదో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు అర్హులు.
- ఆన్‌లైన్ లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని అధ్యయన కేంద్రాల్లో సమర్పించాలి.
- అడ్మిషన్లు పొందిన వారు సెలవు దినాల్లో నిర్వహించే తరగతులకు హాజరవ్వాలి.
- మరింత సమాచారం కోసం www.telanganaopenschool.orgలో సంప్రదించాలి.

పదో తరగతి ప్రవేశాలకు..

- 14 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- పదవ తరగతిలో ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.
- గతంలో పదో తరగతి రెగ్యులర్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన వారు ఓపెన్‌లో రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకోవచ్చు.
- రూ.1,150 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- సర్కార్ ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుంది.
- అడ్మిషన్ తీసుకున్న తర్వాత ఐదేళ్ల వరకు పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు..

- ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- టెన్త్ పాసై ఒక్క ఏడాది గ్యాప్ ఉంటేనే అర్హులు.
- ఐదు సబ్జెక్టులు మాత్రమే ఉంటాయి.
- రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- సర్కార్ ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుంది.

అవసరమైన పత్రాలు

- పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు
- ఇంటర్మీడియెట్ అడ్మిషన్‌కు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్
- పుట్టిన తేదీ సర్టిఫికెట్ (పదో తరగతి అడ్మిషన్‌కు)

ఆగస్టు వరకు అవకాశం

- ఈనెల 31 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్ ఫీజుతో పాటు స్కూల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- అపరాధ రుసుం చెల్లించి ఆగస్టు 28వ తేదీ వరకు అడ్మిషన్లు పొందొచ్చు.

అక్షరాస్యులుగా మార్చేందుకు ..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా నిరక్షరాస్యుల వివరాలు సేకరిస్తోంది. వీరిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిలో చేర్పించేందుకు ప్రతి మండలంలో అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



చదువును మధ్యలో ఆపివేసిన వారు, చదువుపై ఇష్టం ఉన్నవారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రతి మండల కేంద్రంలో ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేశాం. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి.

– సత్యానారాయణ, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కోఆర్డినేటర్

'పరిషత్'కు బీజేపీ కసరత్తు

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేసేందుకు కార్యాచరణ
- అభ్యర్థుల వేటలో కమలనాథులు
- ఇతర పార్టీల్లో అసంతృప్తులకు టికెట్ ఆఫర్లు



తాండూరు: పరిషత్ ఎన్నికల్లో పట్టు సాధించేందుకు బీజేపీ కసరత్తు ప్రారంభించింది. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకే పరిమితమవగా ఈ దఫా స్థానిక పోరులో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి పార్టీ నేతలు ఆశావహుల పేర్లను పరిశీలిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున బీజేపీ అధిష్టాన నేతలు జిల్లా స్థాయిలో పార్టీ శ్రేణులతో కార్యశాల పేరిట క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమైంది.

పార్టీ బలోపేతమే ప్రధాన ఎజెండా

జిల్లాలోని 20 మండలాల జెడ్పీటీసీ స్థానాలకు, 227 ఎంపీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. బీజేపీ సైతం జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను నిలిపేందుకు ప్రయత్నిస్తోంది. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఈ ఎన్నికలను అనుకూలంగా మార్చుకునేందుకు నేతలు యోచిస్తున్నారు. పార్టీ పటిష్టతకు అంకితభావంతో పనిచేయడంతో పాటు ప్రజాబలం కలిగిన వారికే టికెట్ ఇచ్చేందుకు బీజేపీ నేతలు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి కార్యశాల

జిల్లాలోని అన్ని మండలాల్లో జెడ్పీటీసీ, మండల స్థాయి వర్క్ షాప్ పేరిట ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు మండల స్థాయిలో పార్టీ శ్రేణులతో కార్యశాల నిర్వహించనున్నారు. 25, 26 తేదీల్లో మహా సంపర్క్ అభియాన్ పేరిట ఇంటింటికి స్టిక్కర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అనంతరం బూత్ కమిటీల ఆధ్వర్యంలో శ్రేణులు, అభిమానులతో పోలింగ్ బైటక్ కార్యక్రమం, 27వ తేదీ నుంచి 30 వరకు మండల స్థాయి ర్యాలీలు, ఆగస్టు 1, 2వ తేదీల్లో జిల్లా స్థాయి ర్యాలీ నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు అవసరమైతే ఇతర పార్టీల్లో ప్రజాబలం ఉన్న నాయకులకు కాషాయ కండువా కప్పేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. ఇందుకు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల పేరిట జిల్లా నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు.

ఖాతా తెరిచేందుకు..

జిల్లాలో ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పోటీ చేసిన దాఖలాలు లేవు. ఈ దఫా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖతా తెరవాలని పార్టీ నాయకులు భావిస్తున్నారు. మండల స్థాయిలో బలమైన కేడర్ లేకపోవడం . ఉన్న కొందరు నాయకులు సైతం ఖర్చుకు భయపడి పోటీకి దూరంగా ఉంటున్నారనే చర్చలు ఉన్నాయి. చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో పార్టీకి బలం పెరిగిందనే వాదన పలువురు నాయకుల్లో వినిపిస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడితే రాజకీయ పరిణామాలు బీజేపీకి అనుకూలిస్తాయా.. ప్రతికూలంగా మారుతాయా అనేది స్పష్టత రానుంది.

ప్రజలకు అత్యాధునిక వైద్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించేందుకు కృషి చేస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.5 కోట్లు వెచ్చించి 30 పడకల ఆస్పత్రి నిర్మించినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిచాలనే ఉద్దేశంతో ఆస్పత్రుల పరిమితిని పెంచుతూ వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేశారని వివరించారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. నిర్మాణం పూర్తయితే జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు అనుసంధానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, శ్రీను, నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు

- శ్రీవారికి అష్ట దళ పాద పద్మారాధన సేవ
- యాగశాలలో శత కలశ తిరుమంజనం



యాగశాలలో శత కలశ తిరుమంజన పూజ



పూజలందుకున్న స్వామివారు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతి సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ నుంచి వచ్చిన అర్చకులు మొదటి రోజు ఆదివారం ఉదయం వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా యాగశాలలో శత కలశ తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు యాగశాలలో విశేష హోమాలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి వారిని పవిత్ర మండపంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజలు జరిపించారు. పవిత్రోత్సవాల్లో పాల్గొన్న వారు ఓం నమో వేంకటేశాయ నమః అంటూ పరవశించి పోయారు. గోవింద నామస్మరణతో యాగశాల మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

అష్ట దళ పాద పద్మారాధన సేవ

పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో టీటీడీ నుంచి వచ్చిన అర్చకులు ఆదివారం ఉదయం స్వామివారి పాదాల దగ్గర అష్టదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. 108 వెండి పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ పూజలు చేశారు.

నూతన ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



కరన్‌కోట్ ఎస్‌ఐను సన్మానిస్తున్న అశోక్ కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పెద్దేముల్ ఎస్‌ఐ వేణు



యాలాల ఠాణాలో విఠల్

తాండూరు రూరల్/యాలాల: తాండూర్ సబ్ డివిజన్ పోలీస్‌స్టేషన్‌లలో కరన్‌కోట్ ,పెద్దేముల్, యాలాల ఠాణాలకు డీఐజీ ఇక్బాల్ నూతన ఎస్‌ఐలను నియమించారు. కరన్‌కోట్‌లో పనిచేసిన ఎస్‌ఐ విఠల్‌రెడ్డిని వికారాబాద్ సీసీఎస్‌గా బదిలీచేశారు. ఆయన స్థానంలో ఇటీవల ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఎస్‌ఐ రాథోడ్ వినోద్‌ను నియమించారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను యువ నాయకుడు అశోక్ సన్మానించారు.

పెద్దేముల్ ఎస్‌ఐగా వేణుకుమార్

పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా కడల వేణుకుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ ప్రశాంత్ వర్ధన్‌ను కొడంగల్ ఠాణాకు బదిలీ అయ్యారు. వేణుకుమార్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

యాలాల ఎస్‌ఐగా విఠల్

యాలాల: ఠాణా నూతన ఎస్‌ఐగా విఠల్ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వ హించిన గిరి వికారాబాద్ పట్టణ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇక్కడికి వచ్చిన విఠల్, ఠాణా బాధ్యతలను గిరి నుంచి తీసుకు న్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ



అమ్మవారి పూజలో రాజేశ్వరమ్మ తదితరులు

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కేఎస్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. ఆదివారం ఆమె మండల పరిధిలోని మోత్కూర్ సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ.. మండల ప్రజలు సంతోషంగా ఉండాలని అమ్మ వారికి పూజలు చేశామన్నారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు కరణం శ్రీకాంత్‌రావు, గ్రామస్తులు మహిపాల్ రెడ్డి, రామకృష్ణధనేశ్వర్ ముదిరాజ్, ఆనంద్, గోపాల్, రాఘవేందర్, రవికుమార్, చంద్రకాంత్, రాఘవేందర్‌రెడ్డి, ఇస్వయ్య, కిరణ్, శ్రీనివాస్, చెన్నయ్య, సత్యనారాయణ, రమణాజీ, సాయి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహ జంటకు రక్షణ కల్పించండి



ప్రేమ జంటతో కలిసి పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

యాలాల: ఇటీవల కులాంతర వివాహం చేసుకున్న ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం కేవీపీఎస్ సభ్యులు యాలాల ఠాణాలో వినతిపత్రం అందించారు. మండల పరిధిలోని జుంటుపల్లికి చెందిన కర్నె రాకేశ్, సిద్దిపేట జిల్లా హస్నాబాద్ మండలం జిల్లెలగూడకు చెందిన సరిత ప్రేమ వివాహం చేసుకున్నారు. కులాంతర వివాహం చేసుకున్న ఈ జంటకు కేవీపీఎస్, వ్యకాస, ఎమ్మార్పీఎస్ సంఘాలు అండగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. నిలిచిన రాకపోకలు



పీరంపల్లిలో రోడ్డుపై వాగు పారడంతో నిలిచిన రాకపోకలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో కాల్వలు రోడ్లపై పారాయి. ఆయా గ్రామాలకు వెళ్లే రైతులు, ప్రయాణికులు వరద ఉధ్రుతి తగ్గిన తర్వాత రాకపోకలు సాగించారు.

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

మీర్‌పేట: వ్యక్తి వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన తన్నీరు ఏడుకొండలు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం అల్మాస్‌గూడకు వచ్చి నివాసముంటున్నాడు. ఇతనికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రీలక్ష్మి(21)కి మూగ, చెవిటి. వృత్తిరీత్యా టైలరింగ్ చేస్తోంది. ఇంటి ముందు ఉండే శ్రీకాంత్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొంత కాలంగా శ్రీకాంత్ ఆమెను వేధింపులకు గురిచేస్తుండడంతో, మనస్తాపం చెందిన యువతి శనివారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: పీజీ హస్టల్‌లో ప్రమాద వశాత్తు విద్యుత్ వైర్ తాకడంతో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా సీతారాంపురం మండలం గుండుపల్లి గ్రామానికి చెందిన రాచర్ల కొండల్ రావు(43) మూ డేళ్లుగా రాయదుర్గంలోని మధురానగర్‌లో సా యిలక్ష్మీ బాలాజీ ఉమెన్స్ పీజీ హస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం నీటితో పా ర్కింగ్‌లో కడుగుతూ డ్రమ్మును జరుపుతుండగా విద్యుత్ తాకింది. విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని ఓ ప్రైవేట్ హస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డా క్టర్లు ధృవీకరించారు. భార్య నిర్మల ఫిర్యదు మే రకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దుద్యాల్: నెత్తిన బోనంతో యువతి

బోనాలు.. పల్లెల్లో సంబురాలు

ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు ఘనంగా చేశాయి. పలువురు నేతలు, ప్రజా సంఘాల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. పోతురాజుల నృత్యాలు, శివసత్తుల శిగాలు, డప్పు చప్పుళ్ల నడుమ మహిళలు బోనమెత్తి ఆలయాలకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



అనంతగిరి: వెంకటాపూర్ తండాలో ఉత్సవాలకు హాజరైన స్పీకర్ ప్రసాద్



బంట్వారం: బార్వాద్‌లో బోనాలతో ఊరేగింపు



తాండూరు టౌన్: బోనమెత్తిన తాండూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివలీల



దుద్యాల్: ఉత్సవాల్లో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణ, మాజీ ఎంపీపీ ఎల్లమ్మ



వికారాబాద్: పోతురాజుల నృత్యాలు



దోమ: మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు



తాండూరు టౌన్: వెండి ముఖచిత్రం అందజేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్



మోమిన్‌పేటలో..



కుల్కచర్ల: చౌడాపూర్‌లో బోనాల ఊరేగింపు



పూడూరు: అంగడిచిట్టంపల్లిలో పోతురాజు విన్యాసాలు



ధారూరు: మైసమ్మ బోనాల ఊరేగింపు



మర్పల్లి: పెద్దమ్మ తల్లికి నైవేద్యం సమర్పించేందుకు ర్యాలీగా వెళ్తున్న మహిళలు



పూడూరు: బోనాల ఊరేగింపులో భక్తులు, నాయకులు



వికారాబాద్: బోనాలతో మహిళలు

వికసించిన బ్రహ్మ కమలాలు

హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు



కొడంగల్: పట్టణంలోని కలాల్ వాడకు చెందిన శ్రీకర్ గౌడ్ ఇంట్లో శనివారం రాత్రి ఒకేసారి 12 బ్రహ్మ కమలాలు వికసించాయి. ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు అక్కడికి వెళ్లి బ్రహ్మ కమలాలను చూసి తరించారు. అనంతరం శ్రీకర్ గౌడ్ కుటుంబ సభ్యులు వాటికి పూజలు నిర్వహించారు. ఒకేసారి బ్రహ్మ కమలాలు వికసించడంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కొడంగల్ మున్సిపల్ మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ ఆనందమ్మ వాటిని చూసి హర్షం వ్యక్తం చేశారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

59 లీటర్ల మద్యం స్వాధీనం

మొయినాబాద్: బోనాల పండుగ సందర్భంగా వైన్ షాపులు బంద్ ఉండటంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోయారు. అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఐదు బెల్ట్ షాపులపై దాడి చేసి 59 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోనాల పండుగ సందర్భంగా వైన్స్‌లను ఎక్సైజ్ అధికారులు మూసివేశారు. ఇదే అదునుగా భావించి బెల్ట్ షాపుల నిర్వాహకులు రెచ్చిపోయారు. గ్రామాల్లోని కిరాణా షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు మొయినాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని పలు బెల్టుషాపులపై ఆదివారం దాడి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అప్పోజీగూడలో సంతోష్ కిరాణా షాప్‌పై దాడి చేసి 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని చందానగర్‌లో పాండు కిరాణ షాపుపై దాడి చేసి 5 లీటర్లు, తోలుకట్టలో మల్లేష్ కిరాణ షాపుపై దాడి చేసి 6 లీటర్లు, కనకమామిడిలోని మణికంఠ కిరాణ సాపులో 20 లీటర్లు, వీరస్వామి కిరాణాషాపులో 12 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులను, స్వాధీనం చేసుకున్న 59 లీటర్ల మద్యం బాటిళ్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

కారు ఢీకొట్టడంతో మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడి మృతి

మొయినాబాద్: అతివేగంతో దూసుకెళ్లిన కారు రోడ్డు పక్కన ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొట్టడంతో నిర్వాహకుడు మృతి చెందాడు. అతని భార్యకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చౌదర్‌పల్లికి చెందిన దోమ ఉషయ్య(45) బండ్లగూడ జాగీర్‌లో అద్దెకు ఉంటూ మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఉదయం టిఫిన్ సెంటర్ తెరిచి ఊడుస్తుండగా మొయినాబాద్ నుంచి అప్పా వైపు అతివేగంతో వెళ్తున్న కారు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టి ఊషయ్యను మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలకు కాగా, అతని భార్య యశోదకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఊషయ్యను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒంటరి జీవితంపై విరక్తి చెంది

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్‌ఐ గోపాల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్ల లింగం(24) అవివాహితుడు. తల్లిదండ్రులు చనిపోవడం, దివ్యాంగుడైన సోదరుడు కృష్ణకి సైతం వివాహం కాకపోవడంతో యాదగిరిగుట్టకు మకాం మార్చాడు. ప్రస్తుతం గ్రామంలో లింగం ఒంటరిగా ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 15న అతడు కూలీ పనికి వెళ్లిన మరుసటి రోజు నుంచి కనిపించలేదు. అతడి ఇల్లు గ్రామంలో చివరగా ఉండటంతో అటువైపు ఎవరు చూడలేదు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్‌ఐ గోపాల్ ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు తెరిచి చూడగా లింగం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడి బంధువు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఒక రాజకీయ పార్టీగా బీఆర్‌ఎస్ పూర్తిగా వైఫల్యం చెందిందని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ఆరోపించారు. ఆదివారం మండల పరిధిలోని నక్కలపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కేటీఆర్ అసభ్యకరంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతేనే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఎంతో విలువైనదో కేటీఆర్ గుర్తించుకోవాలన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు మానుకొని అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సహకరించాలని సూచించారు.

సస్యరక్షణే ముఖ్యం

మామిడి సాగులో కీలకంగా యాజమాన్య పద్ధతులు

- చెట్ల కొమ్మల కత్తిరింపుతో మెరుగైన ఫలితాలు
- కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ



కందుకూరు: మామిడిని పండ్లలోనే రారాజుగా పిలుస్తుంటారు. రాష్ట్రంలో సుమారు 2.90 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులో ఉండగా, దాదాపు 25.5 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. తెలంగాణలో మామిడి పంటను ఉమ్మడి రంగారెడ్డితో పాటు మెదక్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ జిల్లాల్లో సాగు చేస్తున్నారు రైతులు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 30 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో మామిడి పంట సాగులో ఉంది. వేసవిలో పంట దిగుబడి అనంతరం ఎండిపోయిన చెట్ల కొమ్మల కత్తిరింపు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు జూలై మాసం అనువైనదిగా రైతులు భావిస్తారు. ఉంటుంది. కాగా మామిడి పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తల గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

అనుకూలమైన నేలలు

మామిడి సాగుకు అన్ని నేలలు అనుకూలం. చౌడు, నీరు నిలువ ఉండే బరువైన నల్లరేగడి నేలల్లో మాత్రం నాటకూడదు. లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్లు అభివృద్ధి చెంది చాలా కాలం ఫలాలనిస్తాయి. ఉదజని సూచిక 7.5–8.0 ఉన్న నేలలు మరింత అనుకూలం. మామిడి తోటల్లో చెట్లు బాగా పెరిగి, మంచి దిగుబడులు పొందాలంటే సరియైన పోషకాలు, సమపాళ్లలో అందించడం ఎంతో అవసరం. భూసార పరీక్షల ఆధారంగా పోషకాల లభ్యతను పరిగణలోకి తీసుకుని, సిఫారసు చేసిన ఎరువులను వాడుకోవాలి.

ఎరువుల యాజమాన్యం

తక్కువ వర్షపాతం గల ప్రదేశాల్లో ఎరువులు, పోషక పదార్థాలను వర్షాకాలం ఆరంభంలోనూ, ఎక్కువ వర్షపాతం ఉన్న ప్రదేశాల్లో వర్షాకాలం చివర్లో వేసుకోవడం ద్వారా ఎరువుల వృథాను అరికట్టవచ్చు. వేసవిలో పంట దిగుబడి పూర్తయిన తర్వాత మామిడి చెట్లలో కొమ్మల కత్తిరింపు కీలకంగా ఉంటుంది. దీని ఆధారంగానే తదుపరి పంట దిగుబడి పెరుగుదల ఉంటుంది.



పంట దిగుబడి పూర్తయిన తర్వాత మామిడి చెట్టు కొమ్మలు కత్తిరిస్తున్న రైతు

పోషకాల లోపాలకు..

- సూక్ష్మపోషక లోపాలు అధికంగా ఉన్న తోటల్లో చెట్టుకి 50–75 గ్రాముల బోరాక్స్, 125–150 గ్రాముల జింక్‌సల్ఫేట్, 125–150 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ జూలై–ఆగస్టు నెలల్లో పాదుల్లో వేయాలి.
- జింక్, బోరాన్ లోపం తక్షణ నివారణకు 1 గ్రాము చీలేటెడ్ జింకు, 1.25 గ్రాముల బోరాన్(19శాతం), లీటరు నీటికి (125 గ్రా.బోరాన్/100 లీ.నీటికి) కలిపి కొత్త చిగురు వచ్చేటప్పుడు, పూల మొగ్గల పెరుగుదల దశలో ఉన్నప్పుడు చెట్లు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.
- ఇనుపధాతులోప నివారణకు 2.5 గ్రాములు, అన్నభేది+1 గ్రాము నిమ్మ ఉప్పు లేదా ఒక బద్ద నిమ్మకాయ రసం లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- రైతులు సిఫారసు చేసిన పోషకాలను 50 శాతం పశువుల ఎరువు రూపంలో మిగిలిన 50 శాతం రసాయన ఎరువుల రూపంలో అందించాలి.
- జీవన ఎరువులను సేంద్రియ ఎరువులతో కలిపి చెట్ల పాదుల్లో వేసుకోవాలి. ఆ సమయంలో భూమిలో తగినంత తేమ ఉండేటట్లు జాగ్రత్త తీసుకోవాలి.
- పది సంవత్సరాలు పైబడిన చెట్టుకి సిఫారసు చేసిన సూక్ష్మపోషకాల ద్రావణాన్ని కనీసం 8 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.